సాక్షి కామారెడ్డి

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



సీఎంకు లేఖ రాస్తా..

సీఆర్పీల డిమాండ్లను పరిశీలించాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు.

- 8లో ▸



అక్రమ రవాణాను అరికట్టాలి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

31.1 /21.6

వాతావరణం

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జీఈసీవోగా సుకన్య నియామకం



కామారెడ్డి టౌన్: విద్యాశాఖలో జెండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్(జీఈసీవో)గా సుకన్య నియమితులయ్యారు. ఈ మేరకు డీఈవో ఎస్ రాజు శుక్రవారం తన కార్యాలయంలో ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. సుకన్యను జిల్లా సైన్స్ అధికారి సిద్ధి రాంరెడ్డి, తెలంగాణ గణితఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నరేందర్, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది సన్మానించారు.

'ప్రజాపాలన'కు ముఖ్య అతిథిగా పటేల్ రమేశ్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలో ఈనెల 17న నిర్వహించే ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి హాజరు కానున్నారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే వేడుకలకు అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఓ ప్రకటనలో కోరారు.

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

కామారెడ్డి క్రైం: సాంకేతిక శిక్షణ సంస్థ సెట్విన్ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనునట్లు కో ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీ డీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తోపాటు కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామని, ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73861 80456, 79891 59121 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు



కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ శుక్రవారం ఆ పార్టీ చేపట్టిన చలో హైదరాబాద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. శుక్రవారం ఉదయం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ నేతలను పట్టణ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిప్పిరి వెంకటి, నాయకులు భూంరెడ్డి, నజీరొద్దీన్, పిట్ల వేణు, లక్ష్మీనారాయణ, మోహన్, నరేశ్ రెడ్డి, శౌకత్ తదితరులున్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోపై ఫిర్యాదు



దోమకొండ: మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ లేకపోవడంతో, విధులకు రాకుండా హైదరాబాద్‌లో నివాసముంటూ విధులకు దుమ్మా కొడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ స్థానిక నాయకులతో కలిసి కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలో ఇద్దరే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ ఉండగా సిబ్బంది సంఖ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశ్నించడంతో.. ఆయన కాంగ్రెస్ నాయకులపై చిందులువేశారు. మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అనగా, మీకు ఇష్టమైన వారికి ఫిర్యాదు చేసుకోండి అని ఫోన్ కట్ చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, బాలరాజు, రాములు తదితరులున్నారు.



ఉన్నది ఒకటే గది

- ప్రాథమిక పాఠశాలకు మూడు గదులు
- వజ్జపల్లి పాఠశాలలను వేధిస్తున్న తరగతి గదుల కొరత
- వరండాల్లో సాగుతున్న బోధన
- ఆట స్థలం లేదు.. మూత్రశాలలూ లేవు
- పట్టించుకోని అధికారులు



ఒకే ఆవరణలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు

సదాశివనగర్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సదాశివనగర్ మండలంలోని వజ్జపల్లిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో కొనసాగుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలో 66 మంది, ఉన్నత పాఠశాలలో 74 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే రెండు పాఠశాలలకు కలిపి నాలుగు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు మూడు గదులు ఉండగా.. ఉన్నత పాఠశాలకు ఒక గది ఉంది. దీంతో ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లో ఉన్నత పాఠశాల తరగతుల బోధన సాగుతోంది. కొన్ని తరగతులకు వరండాల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఉన్నత పాఠశాలకు ప్రత్యేకంగా తరగతి గదులను కేటాయించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. తప్పని పరిస్థితుల్లో వివిధ తరగతుల వారిని ఒకే చోట కూర్చోబెట్టి బోధించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. గదులు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఒంటికి, రెంటికి ఇంటికే..

ఒకే ఆవరణలో రెండు పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ కనీస వసతులు లేవు. ఉపాధ్యాయులకు మాత్రమే మూత్రశాలల వసతి ఉంది. దీంతో విద్యార్థులు ఇళ్లకు లేదా ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. వ్యాయామ ఉపాధ్యాయురాలిని కేటాయించినప్పటికీ ఆట స్థలం లేకపోవడంతో ప్రయోజనం లేకుండాపోయింది. పాఠశాల ముందున్న సీసీ రోడ్డుపైనే ఆటలు ఆడిస్తున్నారు.

ఇంటికి పోతున్నాం



మా స్కూల్ మస్తు రోజుల నుంచి గిట్లనే ఉంది. బాత్‌రూమ్‌లు లేకపోవడంతో ఇంటికి పోయివస్తం. చాలా ఇబ్బంది అవుతోంది. ఆడుకోవడానికి స్థలం లేదు. తరగతి గదులు లేవు. వరండాల్లోనే చదువుకుంటున్నాం. వాన కాలం వస్తే తిప్పలైతుంది.

– సందీప్, ఎనిమిదో తరగతి

ఆట స్థలం లేక..



విద్యార్థులతో ఆటలు ఆడించాలని ఉత్సాహం ఉన్నా తగిన ఆట స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేవలం ఇండోర్ గేమ్స్ కొంత మేరకు ప్రాక్టీస్ చేయిస్తున్నా. అవుట్ డోర్ గేమ్స్‌కు కష్టమవుతోంది. తగిన ఆట స్థలం కేటాయించాలి.

– సుభాషిణి, పీఈటీ

టెండర్లు లేక గదుల నిర్మాణం నిలిచి పోయింది

మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా గతంలో నాలుగు తరగతి గదులు మంజూరయ్యాయి. అయితే టెండర్లకు ఎవరూ రాలేదు. ప్రభుత్వం మారడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. తరగతి గదుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– యోసెఫ్, ఎంఈవో, సదాశివనగర్

27న జిల్లా స్థాయి యువజన పోటీలు

కామారెడ్డి క్రైం: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా స్థాయి యువజన పోటీలు నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు, జానపద గీతాలు, సైన్స్ మేళా, హస్తకళ, వస్త్రకళ, అగ్రో ఉత్పత్తులు అనే అంశాలపై కళాభారతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కథా రచన, పెయింటింగ్, కవిత్వం పోటీలు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో ఉంటాయని వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారిని 2025 జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనదలచినవారు జిల్లాకు చెందిన వారై ఉండడంతో పాటు పోటీలు నిర్వహించే తేదీ నాటికి 15 నుంచి 29 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని సూచించారు. గడిచిన మూడేళ్లలో జరిగిన జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్న యువతీయువకులు, బృందాలు ఈ పోటీలకు అనర్హులని పేర్కొన్నారు. 15 నిమిషాల సమయం మాత్రమే కేటాయించే జానపద బృందాల పోటీలకు ఒక్కో బృందంలో 10 మంది మాత్రమే ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



బాన్సువాడ రూరల్: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను బాన్సువాడ కల్కి చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పరిశీలించారు. శోభాయాత్ర రూట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిమజ్జనం పూర్తయ్యేవరకు నీటిపారుదల, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పేకాటలో కొత్త పుంతలు!

పేకాడేవారు అప్‌డేట్ అయ్యారు. ముక్కలాటలో నగదు రహిత లావాదేవీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పోలీసుల దాడుల్లో నామమాత్రంగానే నగదు చిక్కుతోంది.

- అప్‌డేట్ అయిన జూదరులు
- యూపీఐ ద్వారా లావాదేవీలు
- పోలీసుల దాడులలో నామమాత్రంగా చిక్కుతున్న నగదు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో యథేచ్ఛగా పేకాట సాగుతోంది. పోలీసుల దాడులు నామమాత్రం కావడంతో పత్తాలాటకు అడ్డుకట్ట పడడం లేదు. అయితే టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పుడప్పుడు దాడులు చేస్తూ పేకాడుతున్న వారిని పట్టుకుంటున్నారు. గతంలో పేకాట స్థావరాలపై దాడులు చేసినప్పుడు పెద్దమొత్తంలో నగదు చిక్కేది. కానీ ఇటీవలి కాలంలో పెద్దగా నగదు పట్టుబడడం లేదు. దీంతో పోలీసులు ఆశ్చర్యపోతున్నారు.

చిక్కకుండా యూపీఐ దారి..

పోలీసుల దాడులనుంచి తప్పించుకునేందుకు పేకాడేవారు ఎప్పటికప్పుడు కొత్త దారులు అన్వేషిస్తుంటారు. తరచూ స్థావరాలను మార్చడం చేస్తుంటారు. ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ లావాదేవీలవైపు మొగ్గు చూపుతున్నారు. పోలీసులకు చిక్కినా ఎక్కువ డబ్బులు దొరకకుండా చూసుకుంటున్నారు. మామూలు వ్యక్తులు వందలలో ఆడితే, బడాబాబులు మాత్రం రూ.వేలల్లో ఆడుతున్నారు. ఒక్కో టేబుల్‌పై రూ.లక్షలు జమ అవుతున్నాయి. ఇవన్నీ ఆన్‌లైన్‌లోనే డబ్బులు జమ అవుతుండడంతో ఒక్కో ఆటలో రూ. లక్షలు పెట్టి ఆడుతున్నా టేబుల్ మీద మాత్రం నామమాత్రంగానే నగదు ఉంటోంది. పేకాడుతూ దొరికితే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, అక్కడ ఉన్న నగదును, వాహనాలను, సెల్‌ఫోన్లను సీజ్ చేస్తున్నారు. అయితే పెద్ద తలకాయలు ఆడుతున్నా తక్కువ మొత్తంలోనే నగదు దొరుకుతుండడంతో పోలీసులు ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల జిల్లాలోని పిట్లం, కామారెడ్డి రూరల్, భిక్కనూరు తదితర ప్రాంతాల్లో పేకాట అడ్డాలపై పోలీసులు దాడి చేసిన సంఘటనల్లో అక్కడ లభ్యమైంది నామమాత్రపు సొమ్మే. ఆడేవాళ్లు బడాబాబులు అయినపుడు అంత తక్కువ మొత్తంలో డబ్బులు ఉండడం అనుమానాలకు తావిచ్చినా పోలీసులు అంతగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

కాగితాలపై కూడా లావాదేవీలు

పేకాడేవారు కొన్నిచోట్ల కాగితాల మీద లావాదేవీలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఆటలో ఎవరు ఎంత చాలెంజ్ చేశారన్న దానిని ఓ పేపర్ మీద రాస్తున్నారు. దాన్ని అందుబాటులో పెట్టుకుని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, ఆట ఎవరికి వస్తే వారికి ఎంత డబ్బు ఇవ్వాలన్న దాన్ని చెప్పి తర్వాత డబ్బులు చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసులు దాడులు చేసినా ఆడుతున్న చోట పెద్ద ఎత్తున డబ్బు లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



కామారెడ్డి క్రైం: గ్రామపంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను జిల్లా అధికారులు శుక్రవారం విడుదల చేశారు. జిల్లాలోని 535 గ్రామపంచాయితీలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పంచాయతీలలోని నోటీస్ బోర్డులు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో శుక్రవారం ప్రదర్శించారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ పంచాయతీలలో ప్రచురించిన ఓటరు జాబితాను పరిశీలించాలని కోరారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21 వరకు పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాపై కలెక్టరేట్‌లో ఈనెల 18న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 19న మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. ఈనెల 26లోగా అభ్యంతరాలను పరిష్కరించి 28న ఓటరు ఫొటోలతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు.

పచ్చదనం వెల్లివిరియాలి



కలెక్టరేట్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ పరిసరాలు పచ్చదనంతో వెల్లివిరిసేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ పరిసరాలను పరిశీలించారు. సమీకృత భవన సముదాయాన్ని భాగాలుగా విభజించి ఆయా ప్రాంతాలను వివిధ శాఖలకు కేటాయించారు. వాటి పరిరక్షణ బాధ్యతలను అప్పగించారు. కలెక్టర్ సూచనలతో అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యాలయాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్ ఆవరణలోని ప్లాస్టిక్, చెత్తను తొలగించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి 'నిట్టు' సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ నుంచి ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ నిట్టు కృష్ణమోహన్, మాజీ కౌన్సిలర్ ముప్పారపు ఆనంద్, దేవునిపల్లి మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్‌రావు, నాయకుడు ముదాం నవీన్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ నేతలు పార్లమెంట్ ఎన్నికల సమయంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని, బీజేపీకి బహిరంగంగా మద్దతు తెలిపారని ఆరోపించారు. పార్టీ క్రమశిక్షణ చర్యల కింద వారి ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు.

పార్టీనీ బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న అరుణతార

గాంధారి(ఎల్లారెడ్డి): జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార కోరారు. శుక్రవారం ఆమె గౌరారంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగారావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీభూమి అన్యాక్రాంతం

- రాత్రి వేళల్లో చెట్లను నరుకుతున్న అక్రమార్కులు
- అటవీభూముల్ని వ్యవసాయ భూములుగా మార్చేందుకు ప్రయత్నాలు

ఎల్లారెడ్డిరూరల్: అడవుల్లోని చెట్లను యథేచ్ఛగా నరుకుతూ అటవీభూమిని ఆక్రమిస్తున్నారు. అటవీభూమిని వ్యవసాయ భూమిగా మార్చేందుకు అక్రమార్కులు ప్రయత్నాలు సాగిస్తుండగా అడ్డుకోవడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని బొల్లారం సెక్షన్ పరిధిలో ఎక్కపల్లి, హాజీపూర్, తిమ్మాపూర్, లక్ష్మాపూర్, మెంగారం సెక్షన్‌లోని బోనాల్, బాయంపల్లి, ముస్తాపూర్, ఎర్రాపహాడ్ సెక్షన్‌లోని సురాయిపల్లి, ఒంటరిపల్లి అటవీ ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో చెట్లను నరికి అక్రమార్కులు వ్యవసాయ భూములుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోడు పట్టాలు గత ప్రభుత్వం రైతులకు అందించడంతో వాటిని ఆసరా చేసుకున్న రైతులు వారికి ఎకరం భూమికి పోడు పట్టా ఇవ్వడంతో వాటి పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోని చెట్లను నరుకుతూ దానికి తోడుగా మరో రెండు నుంచి మూడు ఎకరాలు సాగు చేసుకునేందుకు అటవీ ప్రాంతాన్ని వ్యవసాయ పంటలు పండించే ప్రాంతంగా మారుస్తున్నారని వన ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు విఫలం!

అటవీ భూములను కాపాడడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని అటవీ ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బీట్ అధికారులకు వారికి కేటాయించిన ప్రాంతాలపైన పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి సమయాల్లో చెట్లను నరుకుతూ అటవీ ప్రాంతాల భూములను వ్యవసాయ భూములుగా మారుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి అటవీ ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వన ప్రేమికులు కోరుతున్నారు.

అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు

అటవీభూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల హాజీపూర్ అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన 9 మందిపై కేసులు నమోదు చేశాం. అటవీ భూములు కబ్జా కాకుండా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

– ఓంకార్, ఎఫ్‌ఆర్‌వో, ఎల్లారెడ్డి

హాజీపూర్ అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన చెట్లు



క్లుప్తంగా

ఆరోగ్యకేంద్రంలో పాము కలకలం



నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం రక్త పెంజర పాము వైద్యులను, సిబ్బంది భయభ్రాంతులకు గురిచేసింది. ఆస్పత్రిలోకి వచ్చిన పాము రోగుల మంచాల కిందకు వెళ్తుండగా వైద్యసిబ్బంది గుర్తించి దానిని చంపేశారు. ఆస్పతి చుట్టు పక్కలా ముళ్ల పొదలు, పిచ్చి గడ్డి ఏపుగా పెరగడంతో తరుచూ పాములు సంచరిస్తున్నాయి. ఉపాధి కూలీల సహకారంతో ఆస్పత్రి చుట్టూ చెట్లను, పిచ్చి మొక్కలను శుభ్రం చేయించాలని స్థానిక రోగులు ఆస్పత్రి వైద్యుడు రోహిత్‌కుమార్ దృష్టికి తీసుకు వచ్చారు.

మహిళలకు గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత



బాన్సువాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను శుక్రవారం బాన్సువాడలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అందజేశారు. అలాగే కల్కి చెరువులో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయనున్నందున కట్టపై లైట్లను ఏర్పాటు చేశామన్నారు. బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు నర్సగౌండ, కిరణ్, నాయకులు తదితరులున్నారు.

కిసాన్ సంఘ్ కమిటీ ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని కొర్పోల్, బాయంపల్లి గ్రామాల్లో శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ కమిటీలు ఎన్నుకున్నట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. కొర్పోల్‌కు చెందిన భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడుగా బ్యాగరి సాయిలు, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, కార్యదర్శి చిలుక సాయిలు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే బాయంపల్లి అధ్యక్షుడు పచ్చంటి రవీందర్, ఉపాధ్యక్షుడు కండ్లపల్లి సాయిలు, కార్యదర్శి పచ్చంటి సాయిలును ఎన్నుకున్నట్లు ఎన్నుకున్నారు.

ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటించాలి

బాన్సువాడ రూరల్ : ప్రతి ఫ్రైడే (శుక్రవారం) డ్రైడేగా పాటించాలని కామారెడ్డి డీఈవో రాజు అన్నారు. బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి హోదాలో శుక్రవారం ఆయన ఇబ్రహింపేట్ జీపీ పరిధిలో పర్యటించారు. కాలనీల్లో పర్యటించి పారిశుద్య నిర్వహణను పరిశీలించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, జీపీ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

కాషాగౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం



కామారెడ్డి టౌన్ : తెలంగాణ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి కామారెడ్డి పట్టణవాసి వేముల కాషాగౌడ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ కే రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో సహకార సంఘాల సమస్యలు, రాజన్న సిరిసిల్ల జిల్లా భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై పరిశోధన జరిపారు. ఈ మేరకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ ఆచార్య బి సుధాకర్ రెడ్డి పరిశోధన గ్రంథం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానానికి ఆమోదం తెలిపారు. డాక్టర్ ఏ పున్నయ్య, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ టీ సంపత్, డాక్టర్ ఎస్ స్వప్న పట్టాను ప్రదానం చేశారు.





గాంధారి గణనాథుల శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, భిక్కనూరులో..



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో..

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో రోడ్లను సరిచేయాలని, వీధి దీపాలు పనిచేసేలా చూడాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు.

– సాక్షి నెట్‌వర్క్



మద్నూర్‌లో చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్, సీఐ, అధికారులు

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



బీబీపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రాజంపేట పోలీస్ స్టేషన్‌లో..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపైన దాడిని నిరసిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. – సాక్షి, నెట్‌వర్క్



బాన్సువాడలో..



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో..

సీఆర్పీల డిమాండ్లపై సీఎంకు లేఖ రాస్తా

కామారెడ్డి రూరల్ : సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని శుక్రవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి సీఆర్పీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఆర్పీ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న సమయంలో శిబిరం వద్ద అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో మీ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారని, కానీ నేటికీ హామీలు నెరవేరలేదన్నారు. ఈరోజు సీఎం ప్రామిస్ డేలో భాగంగా నిరసన తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలు పరిష్కారమయ్యేలా సీఎంకు లేఖ రాస్తానన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాములు, చిరంజీవి, శైలజ, మాధవి, కాశీదాస్, భక్తమాల, సారిక తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేవీఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఆర్పీలు

అథ్లెటిక్స్ ఎంపికలకు విశేష స్పందన



కామారెడ్డి అర్బన్ : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో వివిధ అంశాల్లో అండర్–14, 16, 18, 20 బాలబాలికల ఎంపికలకు విశేష స్పందన కన్పించింది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన దాదాపు 1700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారిని ఈనెల 19, 20 తేదీల్లో ఓయూలో సింథటిక్ ట్రాక్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఆర్ శ్రీనివాస్, శివాగౌడ్, హన్మంత్‌రెడ్డి, ప్రభులింగం తదితరులున్నారు.

సీడీసీ మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదానం



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో సీడీసీ మాజీచైర్మన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన కుమారుడు ఫణీందర్‌రెడ్డిలు శుక్రవారం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. వినాయకనవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్థానిక రెడ్డి పంక్షన్‌హాల్‌లో ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన కుమారుడు ఫణీందర్‌రెడ్డి పెద్దఎత్తున ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు భిక్కనూరు దోమకొండ, రాజంపేట, బీబీపేట, కామారెడ్డి ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు అధికారులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

సంక్షిప్తం

యూట్యూబ్‌లో ఆ షార్ట్ ఫిలింను తొలగించాలి



కామారెడ్డి టౌన్/గాంధారి : సోషల్ మీడియాలో హిందూ దేవుళ్లను కించపరుస్తూ తీసిన షార్ట్ ఫిలింను యూట్యూబ్ నుంచి తక్షణమే తొలగించి షార్ట్ ఫిల్మ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గుడిమేట్ పీఠాధిపతి మహదేవ్ స్వామీజీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మతాలను కించపరుస్తూ వీడియోలు తీస్తే ఊరుకునేది లేదన్నారు. గాంధారి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్వామీజీ భక్తులు రామేశ్వర్, ఆదిత్య, వినోద్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మెట్ల బావి పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. శుక్రవారం డీఆర్‌డీవో సురేందర్, ఎంపీడీవో నరేష్ అక్కడే ఉండి పనులు త్వరితగతిన జరిగేటట్లు చూస్తున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎంపీవో మలహరి, ఉపాధి హామి సిబ్బంది ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



నిజాంసాగర్(జుక్కల్) : ఆరు, ఏడవ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని కాంప్లెక్స్ హెచ్ఎం రాంచందర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ కార్యదర్శి రాములు, సీఆర్పీలు తదితరులున్నారు.

గణపయ్యకు మొక్కి క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి..



మద్నూర్(జుక్కల్) : గణపయ్యకు మొక్కడం సరే.. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ఏంటీ అనుకుంటున్నారా.. అవును నిజమే. మద్నూర్ మండల కేంద్రంలోని మున్నరుకాపు గణేశ్ మండలి సభ్యులు శుక్రవారం గణపయ్య విగ్రహం చేతిలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు మద్దతుగా క్యూఆర్ కోడ్ స్కాన్ పేపర్ ఏర్పాటు చేశారు. గణేశుడి దర్శనం కోసం వచ్చిన భక్తులకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి జేపీసీకి ఈ మెయిల్ చేసి వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు తమ మద్దతు తెలపాలంటూ గణేశ్ మండలి సభ్యులు ప్రచారం చేస్తున్నారు.

యోగాతో జీవితం ఆనందం



కామారెడ్డి అర్బన్: ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓంశాంతి కామారెడ్డి కేంద్రంలో అమృతవేళ యోగా బీజరూప స్థితి అనుభూతి, యోగాం, మురళి, శివునితో అనుభవం, యోగా అనుభవాలపై రెండు రోజుల యోగా తపస్యా కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. ముఖ్య అతిథిగా మౌంట్ అబు ప్రతినిధి బీకే రమేష్‌బాయ్ హాజరై 34 సంవత్సరాలుగా రాజయోగాలో పొందుతున్న అనుభవాలను వివరించారు. నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి ఓంశాంతి కేంద్రాల ఇన్‌చార్జి జయదీదీ, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



భిక్కనూరు : కామారెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతిని ముదిరాజ్ మహాసభ యువజన సంఘం రాష్ట్ర నేత కుక్కల రాజు, కామారెడ్డి జిల్లా ముదిరాజ్ యువజన మహాసభ అధ్యక్షుడు దాసరి నాగరాజు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. చెరువులు కుంటల్లో ముదిరాజ్‌కు చేపలు పట్టేందుకు హక్కులివ్వాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



భిక్కనూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి విక్రం, ఐఎస్ఆర్‌డీ ప్రతినిది అమృత రాజేందర్, అధ్యాపకులు యాలాద్రి,దిలీప్‌లు తదితరులున్నారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్ : మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణ ఈనెల 5వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గంజి ఉన్నత పాఠశాలలో జరిగిన గణితశాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ స్థాయి సమావేశంలో కామారెడ్డి డివిజన్ ఇంచార్జ్ రామకృష్ణతో పాటు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన దేవునిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని భవానిని సన్మానించారు.

ఏఈవోకు సన్మానం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేటలో బదిలీపై వెళ్లిన అశోక్ రెడ్డిని రైతులు ఘనంగా సన్మానించారు. అలాగే నూతనంగా వచ్చిన ఏఈవోగా నియమితులైన శ్రీనివాస్ రెడ్డి ని సన్మానించారు. వీడీసీ అధ్యక్షుడు లక్కాకుల రాములు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సీజనల్ వ్యాధితో తనువు చాలించిన యువతి



రెంజల్: ఉద్యోగ వేటలో విజయం సాధించిన యువతి సీజనల్ వ్యాధి బారిన పడి తనువు చాలించింది. జీవితంలో స్థిరపడేందుకు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరి తల్లిదండ్రులకు చేదోడుగా నిలవాలనుకున్న యువతి వారికి తీరని శోకాన్ని మిగిల్చింది. రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన క్యాతం శిరీష(24) గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. డెంగీతో శిరీష మృతిచెందినట్లు వాట్సాప్ గ్రుపుల్లో స్థానికులు షేర్‌చేశారు. దీంతో ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, పీహెచ్‌సీ వైద్యుడు వినయ్‌కుమార్, గ్రామ ప్రత్యేకాధికారి మున్నీ నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్ గ్రామానికి చేరుకుని విచారించారు. డెంగీతో మృతచెందలేదని నిర్ధారించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల సీజనల్ వ్యాధి సోకి తీవ్రమైన జ్వరంతో అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు డాక్టర్ పేర్కొన్నారు. గ్రామంలో పరిసరాలను శుభ్రం చేయించాలని కార్యదర్శికి అధికారులు సూచించారు.

నిందితుడికి మూడు నెలల జైలు

వర్ని: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ బోధన్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సాయిశివ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై కృష్ణకుమార్ వెల్లడించారు. 2020 నవంబర్‌లో కేసరి పద్మ అనే మహిళ బస్టాండ్ నుంచి వెళ్తుండగా సేవాలాల్ తండాకు చెందిన మెగావత్ రాజు సదరు మహిళ నుంచి ఫోను, పర్సును బలవంతంగా లాక్కొని పారిపోగా బాధితురాలు పీఎస్‌లో చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు రాజుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువైంది. దీంతో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

పిట్లం: తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిమ్మనగర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాందేవ్(23) ఎలాంటి పని లేకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పీఎస్ పరిధిలో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంకాలనీ–అర్సపల్లి మధ్య ఓ టాటా బొలెరోలో 75 సంచుల్లో ఉన్న సుమారు 44 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహన డ్రైవర్ అజయ్ గోదేకర్ పట్టుకొని విచారించగా నవీపేట్ మండలానికి చెందిన హాజీతో కలిసి పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంగోజీవాడిలో..



తాడ్వాయి: మండలంలోని సంగోజీవాడి గ్రామంలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్సు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన పార్శి గణపతి తన ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచాడనే విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకున్నారు. 9.30 క్వింటాళ్ల బియ్యాని పట్టుకొని గణపతిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై సంజీవులు, ఆర్ఐ లక్ష్మణ్ ఉన్నారు.

ముత్యంపేటలో విషాదఛాయలు

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరి మృతి



ముత్తి రమేశ్ (ఫైల్)

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధిలో మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ నెల 10న వినాయకుడికి పూజ సామాను తీసుకురావడానికి గ్రామానికి చెందిన జొన్నల రాము, ముత్తి రమేశ్ కామారెడ్డికి వెళ్లి తిరిగి వస్తుండగా ఉగ్రవాయి–భవానిపేట స్టేజి వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాము గురువారం మృతి చెందగా, ముత్తి రమేశ్(23) శుక్రవారం మృతి చెందాడు. కామారెడ్డిలో ప్రైవేట్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమేశ్ మృతితో కుటుంబసభ్యుల రోదన మిన్నంటాయి.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజమణి (ఫైల్)

మోర్తాడ్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భీమ్‌గల్ పట్టణంలోని అయ్యప్పనగర్‌కు చెందిన పోతుగంటి రాజమణి(48) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఉన్న యాసిడ్‌ను సేవించింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆర్మూర్‌కు తరలించగా అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. బాలిక కిడ్నాప్

- తెలంగాణ యువకుడు.. ఆంధ్ర అమ్మాయి
- పెళ్లి చేసుకునేందుకు అన్నవరం వెళ్తుండగా అడ్డుకున్న ఎస్సై
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- మిగిలిన వారి కోసం గాలింపు

ద్వారకాతిరుమల: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన 14 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన యువకుడిని, అతడికి సహకరించిన కుటుంబ సభ్యులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కోడిగూడెం గ్రామానికి చెందిన బాలికకు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గండికోట దశరథ్ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దశరథ్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. ఈ క్రమంలో దశరథ్ ఈనెల 11న ఉదయం తన తల్లిదండ్రులు గండికోట ఎల్లయ్య (వెంకట్), లక్ష్మి, చిన్నాన్న గండికోట అశోక్, బావలు పంద్ల రాము, వల్లపు సురేష్‌తో కలసి కారులో కోడిగూడెంలోని బాలిక ఇంటికి వెళ్లాడు. బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకుని, పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లాడు. దీనిపై బాలిక తండ్రి చొక్కా సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుపై అదే రోజు ఎస్సై సుధీర్‌పై కిడ్నాప్, పలు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్ పర్యవేక్షణలో ఈ కేసును ఎస్సై సుధీర్ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలికను పెళ్లి చేసుకునేందుకు శుక్రవారం ఓ కారులో అన్నవరం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎం.నాగులపల్లి జాతీయ రహదారిపై ఎస్సై సుధీర్ సిబ్బందితో కలిసి వారిని అడ్డుకున్నారు. అనంతరం దశరథ్‌ను, అతని తల్లిదండ్రులను అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన కారును సీజ్ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

డిచ్‌పల్లి: మండల పీఎస్ పరిధిలోని ధర్మారం(బి) శివారులో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. శుక్రవారం రాత్రి ధర్మారం శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు చేపట్టారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 నగదును సీజ్ చేసి డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

కరడ్‌పల్లిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కరడ్‌పల్లిలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలోని ఓ కొట్టంలో ఐదుగురు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఐదుగురిపై గేమింగ్‌యాక్టు కింద కేసునేమోదు చేసి రూ.8వేల నగదు సీజ్ చేశామన్నారు.

అటవీ భూములను చదును చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామం కంపార్ట్‌మెంట్–380, ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి గ్రామాల పరిధిలో అటవీ భూములను ఆక్రమించి చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అటవీ సంపద దోపిడీకి గురైతే ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట సెక్షన్ అధికారి తుకారం రాథోడ్, బీట్ అధికారులు ఖాదీర్, రంజిత్, సందీప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది వంశీ, హరీశ్ ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. తగుచర్య నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

డయల్ 100 దుర్వినియోగం


- ముగ్గురికి జైలు శిక్ష

ధర్పల్లి: అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన డయల్–100ను దుర్వినియోగం చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతాయిపేట్‌కు చెందిన చెప్పాల బాబు, సుంచ రాజు, డీబీ తండాకు చెందిన గుగ్లోత్ అనిల్ ప్రతిసారి డయల్–100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు సేవలను దుర్వినియోగం చేశారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యం మత్తులో ఆకతాయిలు డయల్100కు ఫోన్ చేసి విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని అలాంటి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి సహాయం అందించలేకపోతున్నామని అన్నారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఆరుగురికి రూ. 11వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ అజ్మీర సంకేత్ కుమార్ డిచ్‌పల్లిలోని మానవతాసదన్‌లో ఒకరోజు సోషల్ సర్వీస్ చేయాలని ఆదేశించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి



నాగిరెడ్డిపేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాటూరి రవి(45) తాండూర్ శివారులోని నాగనయ్య చెరువులో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. గురువారం తాండూర్‌లో పనిఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతని కోసం గాలించగా నాగనయ్య చెరువు మెట్ల వద్ద రవి చెప్పులు కనిపించాయి. శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలించగా రవి మృతదేహం లభ్యమైంది. చెరువులో కాలు కడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.